**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

అమ్మ,నాన్న,మనకు నారాధ్యదైవాలు
నడక,పలుకు బుద్ధి నడతనేర్పు
ప్రేమతోడపెంచి పెన్నిదిగావారు
వరములిచ్చునంట వలసినన్ని

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 335 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 31-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


- ఇంట్రాడేలో ఒక దశలో రూ.95.22 స్థాయికి
- చివరికి 15 పైసల లాభంతో రూ.94.70 వద్ద ముగింపు
- పశ్చిమాసియా యుద్ధంతో 4.1 శాతం నష్టపోయిన రూపాయి
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం పతనం
- 14 ఏళ్లలో ఇదే అతిపెద్ద వార్షిక క్షీణత

# డాలర్ =రూ.95

## -సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టానికి భారత కరెన్సీ



ముంబై

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్టానికి జారుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఒక దశలో రూ.95.22 వద్దకు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 115 డాలర్లకు ఎగబాకడంతో పాటు డాలర్ బలపడటం, మన ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ముడి చమురు ధరలు దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగితే డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.100 దిశగా పయనించనుందని వారన్నారు.

-మిగతా 2 లో

## ఆహార కల్తీ నియంత్రణ

# సరికొత్త వ్యవస్థ



### ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన

- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన

-మిగతా 2 లో



# రాయల్స్ రాజసం

- సమిష్టిగా రాణించిన రాజస్తాన్
- సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధసెంచరీ
- చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

గౌహతి

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ప్రారంభ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ సమిష్టిగా మెరిసింది. తొలుత బౌలింగ్‌లో బర్గర్, ఆర్చర్, రవీంద్ర జడేజా రాణించడంతో చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె) 127పరుగులకే పరిమితం చేసిన రాజస్తాన్ రాయల్స్.. అనంతరం సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధసెంచరీతో రాణించడంతో ఆ లక్ష్యాన్ని 12.1ఓవర్లలోనే సునాయాసంగా ఛేదించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు వర్షం కురవడం, టాస్ గెలవడం రాజస్తాన్‌కు కలిసొచ్చింది. టాస్ గెలిచిన రాజస్తాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకోగా... బౌలర్లు కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము కానీయలేదు. చెన్నై బ్యాటర్లను క్రీజ్‌లో కుదురుకోనివ్వక...

-మిగతా 2 లో



## ఇరాన్ దిగిరాకపోతే

# స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

వాషింగ్టన్

ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే,

-మిగతా 2 లో




## చైనా సీసీ

# కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ,

చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను

-మిగతా 2 లో

# విజయ్ ఆస్తులు రూ 603 కోట్లు..

### ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



చెన్నై

టీవీకే చీఫ్ విజయ్ తనకు రూ.603 కోట్ల స్థిర,చరాస్తులు ఉన్నట్టు సోమవారం ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. తనకు రూ.404.58 కోట్ల చరాస్తులున్నాయని విజయ్ తెలిపారు. కొడైకెనాల్‌లోని వ్యవసాయ భూమి, చెన్నైవ్యాప్తంగా ఉన్న వాణిజ్య, నివాస భవనాలతో కూడిన చరాస్తుల

-మిగతా 2 లో

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- మంత్రి అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలి
- అక్రమ మైనింగ్, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు..సాక్ష్యాధారాలు అందజేత



హైదరాబాద్

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది.

-మిగతా 2 లో

# ఏప్రిల్ 1 నుంచి జనగణన..

- మొదటి విడతలో గృహ గణన
- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- తెలంగాణలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే
- ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్'కు అవకాశం



న్యూఢిల్లీ,

దేశంలో జనగణనకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నది. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా 33 ప్రశ్నలను అడుగుతారని కేంద్రం తెలిపింది. రెండో దశలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇది ప్రారంభం కానున్నది. జనగణన కోసం పౌరులు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని కేంద్రం వెల్లడించింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ), జన గణన కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ, ' ఈసారి తొలిసారిగా పౌరులు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ద్వారా స్వయంగా తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు. ఇది ఇంటింటి సర్వే ప్రారంభానికి 15 రోజుల ముందు అందుబాటులో ఉంటుంది' అని తెలిపారు. భారత్‌లో నివసిస్తున్న పౌరులకు మాత్రమే 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ఆప్షన్ వర్తిస్తుందని చెప్పారు. మరికొద్ది రోజుల్లో పలు రాష్ట్రాల్లో ఇంటింటి సర్వే ప్రారంభం

-మిగతా 2 లో

## నక్సల్స్ విముక్త

# భారత్!



### దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది

- 75 ఏండ్లు నక్సల్స్‌ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనే
- అడవి బిడ్డలను అభివృద్ధికి దూరం చేసింది నక్సలైట్లే
- ఆయుధాలు చేత పట్టి పోరాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుదీర్ఘ ప్రకటన

న్యూఢిల్లీ

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90

-మిగతా 2 లో



## పౌర స్వేచ్ఛను

# హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన

-మిగతా 2 లో

# డాలర్ =రూ.95

మొదటి తరువాయి

ఆరంభంలో లాభాలు: క్రితం వారాంతంలో 89 పైసలు క్షీణించి రూ.94.85 వద్ద ముగిసిన డాలర్‌-రూపాయి మారకం విలువ.. సోమవారం ట్రేడింగ్‌లో రూ.93.62 వద్ద ప్రారంభమైంది. మరింత బలపడి రూ.93.57 వద్దకు చేరుకుంది. అంటే, గత శుక్రవారం ముగింపుతో పోలిస్తే 128 పైసలు బలపడింది. బ్యాంకుల అమెరికన్‌ కరెన్సీ ఓవర్‌నైట్‌ నెట్‌ ఓపెన్‌ పొజిషన్స్‌ను 10 కోట్ల డాలర్లకు తగ్గిస్తూ ఈ నెల 27న ఆర్బీఐ సర్క్యులర్‌ జారీ చేయడం ఇందుకు దోహదపడింది. అయితే, ఆర్బీఐ చర్య రూపాయిని ఎంతోసేపు ఆదుకోలేకపోయింది. కార్పొరేట్‌ సంస్థలు భారీగా డాలర్లను కొనుగోలు చేయడంతో మన కరెన్సీ మళ్లీ జారుకోవడం మొదలు పెట్టింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్‌ రేటు రూ.95.22 వద్దకు చేరుకుంది. చివర్లో మళ్లీ తేరుకుంది. క్రితం క్లోజింగ్‌తో పోలిస్తే, 15 పైసల లాభంతో రూ.94.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూపాయి మారకం విలువ 165 పైసల శ్రేణిలో ఊగిసలాడింది. గత నెల 28న పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి రూపాయి మారకం విలువ 4.1 శాతం మేర క్షీణించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 9.88 శాతం పతనమైంది. గత 14 ఏళ్లలో మన కరెన్సీకిదే అతిపెద్ద వార్షిక క్షీణత. అంతేకాదు, వర్ధమాన దేశాల్లోకెల్లా అత్యధికంగా నష్టపోయిన కరెన్సీ కూడా మనదే. 2011-12 ఆర్థిక సంవత్సరంలో డాలర్‌తో రూపీ మారకం విలువ 12.4 శాతం తగ్గింది.

# రాయల్స్ రాజసం

మొదటి తరువాయి

వరుసగా వికెట్ల పడగొట్టారు. దీంతో చెన్నై 19పరుగులకే 3వికెట్లు, ఆ తర్వాత 51 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ 12.1ఓవర్లలో కేవలం 2వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. సూర్యవంశీ అర్ధసెంచరీకి తోడు.. జైస్వాల్(38నాటౌట్), జురెల్(18), కెప్టెన్ రియాన్ పరాగ్(14నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు టాస్ ఓడిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ శాంసన్(6)ను నంద్రె బర్గర్(2/26) బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ తర్వాతి ఓవర్లో గైక్వాడ్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ఆయుష్ మాత్రే(0)ను బర్గర్ పెవిలియన్ పంపాడు. బర్గర్, ఆర్చర్ విజృంభణతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయి చెన్నై పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో ఇంప్యాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్(17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, సుదీర్ఘ విరామం తర్వాత రాజస్థాన్‌కు ఆడుతున్న జడేజా తొలి ఓవర్లోనే తన మ్యాజిక్ చూపించాడు. పెద్ద షాట్లకు సిద్ధమైన సర్ఫరాజ్‌ను ఎల్బీగా ఔట్ చేయగా.. చెన్నై 51కే ఐదు వికెట్లు కోల్పోయింది. సిక్సర్ బాదిన శివం దూబే(6)ను సైతం జడేజా ఔట్ చేసి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కార్తిక్ శర్మ(18), జేమీ ఓవర్టన్(43)లు చివరి వరకు క్రీజ్‌లో పాతుకుపోయారు. సందీప్ శర్మ ఓవర్లో బౌండరీతో చెన్నై స్కోర్ వంద పరుగులు దాటింది. అన్షుల్ కంభోజ్ (7నాటౌట్) రెండు ఫోర్లు బాదగా.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓవర్టన్ సిక్స్ బాది ఆ తర్వాత బంతికే ఔటయ్యాడు. దీంతో చెన్నై 19.4ఓవర్లలో 127 పరుగులకు కుప్పకూలింది. రాజస్తాన్ బౌలర్లు ఆర్చర్, బర్గర్, జడేజాకు రెండేసి, బ్రిజేష్, సందీప్, బిష్ణోరుకు ఒక్కో వికెట్ దక్కాయి.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

మొదటి తరువాయి

హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎ÷-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం' అని హెచ్చరించారు.

# చైనా సీసీ కెమెరాల బ్యాన్

మొదటి తరువాయి

భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండ్డంల్గ÷జేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

మొదటి తరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది. సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు. మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

మొదటి తరువాయి

మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని



పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు

# ఏప్రిల్ 1 నుంచి జనగణన..

మొదటి తరువాయి

కాబోతున్నదని, జనాభా లెక్కల సమయంలో సేకరించే పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యమైందని, ఆర్టీఐ కింద గానీ, కోర్టుల ముందు సాక్ష్యంగా గానీ, మరే ఇతర సంస్థతోనూ పంచుకోరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సారి జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనున్నారు.

33 ప్రశ్నలు..

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే జనాభా లెక్కల గృహాల జాబితా, గృహ గణన సందర్భంగా 33 ప్రశ్నలను అడుగుతారని ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ జనాభా గణన సంబంధిత సందేహాలు, స్వీయ గణనకు సంబంధించిన ప్రశ్నలు సహా అనేక రకాల అంశాలను ఎఫ్‌ఏక్యూలు ప్రస్తావించాయి. అదనంగా, ఇంటి ఫ్లోరింగ్, రూఫ్‌లో ఉపయోగించే పదార్థాలు, కుటుంబంలో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, కుటుంబ పెద్ద లింగం, వినియోగించే ధాన్యాల రకాలు, ప్రాథమిక, ఆధునిక సౌకర్యాల లభ్యత, సొంతంగా కలిగి ఉన్న వాహనాల రకాలకు సంబంధించిన ప్రశ్నలకు వివరణలను పోర్టల్ అందచేస్తుంది. జనగణన మొదటి దశలో ఎన్యూమరేటర్లు ఇంటి నంబర్(మున్సిపల్, స్థానిక పాలనాధికార సంస్థ లేదా సెన్సస్ నంబర్), ఇంటిలోపల ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థాల గురించి ప్రశ్నలతో ప్రారంభిస్తారు. అనంతరం ఇంటి వినియోగం, దాని పరిస్థితి, కుటుంబంలో సాధారణంగా నివసించే వ్యక్తుల సంఖ్యను ప్రశ్నిస్తారు. ఎఫ్‌ఏక్యూ ప్రకారం ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూ ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిని కుటుంబ పెద్దగా గుర్తిస్తారు. అదేవిధంగా ఇంటి యాజమాన్య హోదాకు సంబంధించి ఒక వ్యక్తి అద్దె ఇంట్లో నివసిస్తూ భారతదేశంలో వేరే చోట సొంత ఆస్తిని కలిగి ఉంటే అది వారి తల్లిదండ్రుల ఇల్లు అయినా లేదా వారు కొనుగోలు చేసిన ఇల్లు అయినా అద్దె ఇంట్లో నివసిస్తున్నారు కాని వేరే చోట సొంత ఇల్లు ఉంది అనే ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

# పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

మొదటి తరువాయి

భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నక్సల్స్ విముక్త భారత్!.

మొదటి తరువాయి



నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు. బస్తర్ ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని, ఈ ఘనత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు, స్థానిక గిరిజన సమాజానికే దక్కుతుందని ఆయన తెలిపారు. దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియజేస్తాం. అయితే మన దేశం నక్సల్స్ రహితంగా మారిందని చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించి ఆయుధాలు పట్టుకునే వారిని ఉపేక్షించబోమని, అటువంటి వారు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన చెప్పారు. ఏండ్ల తరబడి గిరిజన ప్రజలను చీకట్లో ఉంచారని, తమ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసేందుకు లెఫ్టిస్టులు వారిని తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం తర్వాత 60, 75 ఏండ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాటు గిరిజనులకు ఇండ్లు, స్కూళ్లు లేదా మొబైల్ టవర్లను కాంగ్రెస్ అందుబాటులోకి తీసుకురాలేదు. కాని ఇప్పుడు మీరేం చేశారని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. 1970వ దశకం నుంచి వీటిని ఎందుకు సాధించలేకపోయారని నక్సలిజాన్ని సమర్థించే వారిని నేను ప్రశ్నిస్తున్నాను అని అమిత్ షా నిలదీశారు. బస్తర్ నుంచి నక్సలిజాన్ని దాదాపు పూర్తిగా నిర్మూలించామని, ప్రతి గ్రామంలో పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో రేషన్ షాపులు ఏర్పాటు చేశామని, ప్రతి తహసీల్ పంచాయత్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

# విజయ్ ఆస్తులు రూ 603 కోట్లు..

మొదటి తరువాయి



విలువ రూ.198.62 కోట్లుగా ఉంది.తన భార్య సంగీత పేరిట రూ.15.76 కోట్లు విలువజేసే ఆస్తులున్నట్టు విజ య్ ప్రకటించారు. వ్యక్తిగతంగా తన వద్ద రూ.2 లక్షల నగదు, వివిధ బ్యా ంకు ఖాతాల్లో రూ.213 కోట్లకుపైగా డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలి

**-తీదేడు గ్రామ మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన**



**దేవరకొండ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట) గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని కోరారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శమని, ఆడబిడ్డ పెళ్లి సహాయం నుండి పుట్టిన బిడ్డకు ఇంటికీ చేరేవరకు మహిళలకు ప్రత్యేక పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. "మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు... నేలమీద నుండి అంతరిక్షం వరకు మహిళల ఆధిపత్యమే" అని ఆమె వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి, ధరణిపతి రమణారావు, గ్రామ పాలకవర్గ సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్, సందె లక్ష్మయ్య, మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు, గ్రామస్తులు మర్రు రామారావు, సిమర్ల శ్రీను యాదవ్, జూలూరి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి బాదిని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

**-మర్రిగూడ ప్రజల విజ్ఞప్తి**



**మర్రిగూడ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శివన్నగూడెం గ్రామ రైతు సేవా సహకార బ్యాంకుకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం బ్యాంకు సేవలు, ఇతర పనుల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల రక్షణ కోసం ఆర్‌అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం



**మర్రిగూడ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ శాలిని ప్రారంభించారు. ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులతో ఈ క్యాంపును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో ప్రజలకు ఉపశమనం



**వంగూరు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా డ్రైనేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లపైకి వచ్చింది. దీంతో వచ్చే--పోయే వాహనదారులకు కొంత అంతరాయం కలిగింది.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**తలకొండపల్లి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి ఉన్నత పాఠశాలలో 2008--09 బ్యాచ్ విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జ్యోతి రాణి, శారదా, వసుంధర, ఆంజనేయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని పాఠశాల ఆవరణను ఉత్సాహభరితంగా మార్చారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు-వ్యక్తి మృతి

**గుడిపల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**




**దేవరకొండ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా గుడిపల్లి మండల పరిధిలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పీఏపల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవులు గౌడ్ (బోరు డిండి యజమాని) బోర్ బండికి డీజిల్ నింపించి తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో చెన్నకేశవులు గౌడ్ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సమయపాలన పాటించని మీ సేవ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ వినతి పత్రం




**వేములపల్లి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేములపల్లి మండల తహసిల్దార్ హేమలతకు బీజేపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని రెండు మీ సేవ కేంద్రాలు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పెదమం భరత్ మాట్లాడుతూ, "ఎప్పుడూ మూసివేసి ఉండే ఈ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో లేవు. మారుమూల గ్రామాల నుండి వచ్చిన ప్రజలు వేసవి తాపంతో తిరిగి వెళ్ళిపోతున్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు" అని విమర్శించారు. సమయపాలన పాటించని మీ సేవ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు పేరం విలేఖర్, గోపి సతీష్ శివ పాల్గొన్నారు.

## పీజుల పెంపుపై ప్రైవేట్ స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన




**బోడుప్పల్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేట్ సిధార్థ పబ్లిక్ హైస్కూల్ ఎదుట సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం పరిమితికి మించి పీజులు పెంచడం వల్ల ఆర్థికంగా భారమవుతోందని వారు వాపోయారు. అడ్మిషన్ సమయంలో "తరగతి నుండి మరో తరగతికి మారేటప్పుడు కేవలం 2--5 శాతం మాత్రమే పెంపు ఉంటుంది" అని చెప్పి, ఇప్పుడు 15--20 శాతం వరకు పెంచడం అన్యాయమని తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ యూనిఫామ్, పుస్తకాలను తరచూ మార్చడం వల్ల కూడా అదనపు భారం పడుతోందని వారు తెలిపారు. ఇప్పటికైనా స్కూల్ యాజమాన్యం స్పందించి పీజులు తగ్గించాలని, లేకపోతే జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**-ప్రభుత్వ వైఖరిపై పాండురంగా రెడ్డి తీవ్ర విమర్శ**



**కందుకూరు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉద్యమకారులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడం ప్రభుత్వ అప్రజాస్వామిక, అనైతిక చర్య అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు. "తెల్లవారుజామునే ఉద్యమకారుల ఇళ్లకు వెళ్లి వారిని భయాందోళనకు గురిచేయడం ప్రజా పాలనకు సంకేతమా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం ప్రభుత్వ అసమర్థతను సూచిస్తుందని విమర్శించారు. "అమరవీరుల ఆత్మ బలిదానాల వల్ల, వేలాది మంది ఉద్యమకారుల పోరాటాల వల్ల సిద్ధించిన తెలంగాణలోనే నేడు ముఖ్యమంత్రి, మంత్రులు పదవులను అనుభవిస్తున్నారు. అదే ఉద్యమకారులను అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పాండురంగా రెడ్డి కోరారు. ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీస్తే భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్‌కు రాజిరెడ్డి పేరు

**-ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**



**హైదరాబాద్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ నుండి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌కు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కారిడార్ పేరును ప్రభుత్వం సోమవారం ఉత్తర్వుల ద్వారా ప్రకటించింది. స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు, ఈ ప్రాంత అభివృద్ధికి రాజిరెడ్డి చేసిన కృషి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన పేరును ఫ్లైఓవర్‌కు పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఇప్పటికే పనులు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్నందున సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. త్వరలోనే పేరుకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు.

# ప్రజా ప్రభుత్వంలోనే మెరుగైన పాలన

-వెల్దండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**వెల్దండ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, "ప్రజా ప్రభుత్వంలోనే నిరుపేదలకు మెరుగైన పాలన అందిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేదలకు గృహ సౌకర్యం కల్పిస్తున్నాం" అని తెలిపారు.మండల కేంద్రంలోని మోత్కు పార్వతమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన నిరుపేదలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో ఇళ్లు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు మారేపల్లి మంజుల శ్రీను, ముదికొండ రమేష్, నాయకులు కొయ్యల పుల్లయ్య, తుంగ శ్రీను, క్యాసరపు మల్లేష్, ఉడుత వెంకయ్య, జంగిలి ఆనంద్, ఉడుత పరమేష్, డేవిడ్, మట్ట మల్లేష్, రాజు, లింగం తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు తోడ్పాటు



**కల్వకుర్తి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన ఆర్యవైశ్య అల్లంపల్లి శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా వారి పిల్లల చదువుకు కూడా సహాయం అందిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కల్వకుర్తి మండల అధ్యక్షుడు గంధం ప్రసాద్, జిల్లా నాయకుడు దాచపల్లి శ్రీనివాసులు, ఉప్పల వెంకటేష్ సైన్యం దారమోని గణేష్, ఐలా శేఖర్ గౌడ్, పోల నరేష్, ఆకారం శివ తదితరులు పాల్గొన్నారు.

# రమాదేవి కులకర్ణి కథల సంపుటి 'గగ్గమ్మ' ఆవిష్కరణ



**హైదరాబాద్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కూకట్‌పల్లి పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన్‌భవన్‌లో తపస్వి మనోహరం అంతర్జాల మాస, వారపత్రిక, పబ్లికేషన్స్ సంస్థ 5వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు రమాదేవి కులకర్ణి రచించిన కథల సంపుటి 'గగ్గమ్మ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. "కాసేపు నాతో" శీర్షిక కాలమిస్ట్‌గా ప్రసిద్ధి చెందిన ఆమె రచనలలో పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న 22 కథల సమాహారమే ఈ సంపుటి అని నిర్వాహకులు వివరించారు.కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చంద్రప్రతాప్ కంతేటి, ప్రముఖ కవి--నటుడు, సినీ గేయరచయిత, నంది--ఉగాది పురస్కార గ్రహీత సాదనాల వెంకట స్వామి నాయుడు, నవలా రచయిత--కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పి. చంద్రశేఖర ఆజాద్, తపస్వి సంస్థ సీఈఓ నిమ్మగడ్డ అవినాష్ కార్తిక్, డైరెక్టర్లు అఖిల, బుజ్జమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన రైతు కమిషన్





**వికారాబాద్, మార్చి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మార్కెట్ యార్డుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తెలంగాణ అగ్రికల్చర్ & రైతు వెల్ఫేర్ కమిషన్ సోమవారం వికారాబాద్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించింది. భారతీయ కిసాన్ సంఘ్ విజ్ఞప్తి మేరకు కమిషన్ ఈ పర్యటన చేపట్టింది.కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మార్కెట్ యార్డ్‌లో రైతులతో నేరుగా సమావేశమై వారి సమస్యలను వినిపించుకున్నారు. ముఖ్యంగా తూకాల్లో లోపాలు, అధిక కటింగ్‌లు, అక్రమ వసూళ్లు, వ్యాపారుల సిండికేట్ వంటి అంశాలపై రైతులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు.రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఎలక్ట్రానిక్ తూకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, తేమ శాతం పేరుతో దిగుబడిలో అధిక కోతలు విధిస్తున్నారని తెలిపారు. మార్కెట్ ఫీజుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి





ధరలను తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు తమ సమస్యలను వివరించగా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వరి మరియు మార్కెటింగ్ శాఖ అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు సభావత్ రాములు నాయక్,కె.వి.ఎన్. రెడ్డి, భూమి సునీల్, భవాని, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి లక్ష్మీబాయి, అదనపు జిల్లా మార్కెటింగ్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



**దేవరకొండ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో ఇటీవల వెలువడిన గురుకుల పాఠశాల ఫలితాల్లో సీట్లు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.కిన్నెర శివ, పెరుముల క్రాంతి, పెరుముల జోష్న, కలుముల సాత్విక అనే నలుగురు విద్యార్థులను గ్రామ సర్పంచ్ వర్కాల బాల నారాయణ, ఉపసర్పంచ్ బద్దెల బాలింగయ్య, వార్డు సభ్యులతో కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బాల నారాయణ మాట్లాడుతూ, "ఇలాగే ముందుకు పోటీ పరీక్షల్లో సీట్లు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలి" అని విద్యార్థులను ప్రోత్సహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, ఆంజనేయులు, లావణ్య, రవి, వెంకటయ్య, వార్డు సభ్యులు వి. జ్యోతి రవి, యం. దామోదర్, పి. రాజు, బి. బాలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం ఆదేశించిన కలెక్టర్



**నాగర్‌కర్నూల్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జీవి శ్యాంప్రసాద్ లాల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి హాజరై ప్రజల వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలి" అని సూచించారు.ఈసారి ప్రజావాణిలో 41 దరఖాస్తులు వచ్చాయని ఆయన వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను వారంలోనే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పిడుగు పడి ఆవు మృతి



**వంగూరు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల పరిధిలోని డిండి చింతపల్లి గ్రామంలో సోమవారం పిడుగు పడింది.ఈ ఘటనలో రైతు బచ్చమయ్యకు చెందిన ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది.

# ముగిసిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**మర్రిగూడ, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని యరగండ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రథోత్సవంతో ఘనంగా ముగిశాయి.గ్రామ సర్పంచ్ వల్లంలో సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు కన్నుల పండుగగా సాగాయని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఆలయ పూజారి హరిబాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# రాయల సుజన కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



**కురవి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కురవి మండలంలోని నల్లెల్ల గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రాయల రవి గారి మాతృమూర్తి రాయల సుజన ఇటీవల మృతి చెందారు.సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన వారు -- బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, స్థానిక సర్పంచ్ రెంటాల కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణమూర్తి, స్థానిక నాయకులు, కార్యకర్తలు.గ్రామస్థులు ఈ సందర్భంలో కుటుంబానికి ధైర్యం చెప్పి తోడ్పాటు అందించారు.

# నూతన కార్యదర్శికి సన్మానం



నూతన కార్యదర్శి కె అశోక్ స్వాగతం పలుకుతూ సన్మానం చేస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, ఉప సర్పంచ్ బొడిగె శివకృష్ణ.

**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం ర్యాకల్దేవుపల్లి గ్రామానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి కె. అశోక్‌ను సోమవారం జీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్, ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణలు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు ఇన్‌చార్జీగా సేవలందించిన పంచాయతీ కార్యదర్శి హరిబాబు, గ్రామస్థులు, సభ్యులు పాల్గొన్నారు.

# కుల వివక్షత పాటిస్తే కఠిన చర్యలు తప్పవు

**రాముపల్లిలో పౌరహక్కుల దినోత్సవం**



**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని రాముపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "గ్రామాల్లో కుల వివక్షత పాటిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రతి పౌరుడు తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలి. అంటరానితనం ఏ రూపంలో ఉన్నా చట్టపరంగా చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు.అదేవిధంగా విద్య, ఉపాధి అవకాశాలు, కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వ పరంగా కల్పించే అవకాశాలను వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఆంజనేయులు, ఎంపీవో కిరణ్, ఆర్ఎ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఉపసర్పంచ్ విద్యాలత, జీపీవో షఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య, వార్డు సభ్యులు టీ. సింధూజ, పి. తిరుపతి, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**షాద్‌నగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణం చటాన్‌పల్లి శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ విషయాన్ని షాద్‌నగర్ ఎస్సై సుశీల వెల్లడించారు.మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు తెలుపు రంగు షర్టు ధరించి ఉన్నారని వివరించారు.మృతదేహానికి ఎవరైనా గుర్తుపడితే వెంటనే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సుశీల సూచించారు.

# ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

**సుల్తానాపూర్‌లో గోగుల రాములు పదవీ విరమణ సన్మానం**



**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు గోగుల రాములు పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా సన్మాన సభ జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య మాట్లాడుతూ, "అన్ని రంగాల్లోని వృత్తులకంటే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే" అని అన్నారు.ఎంఈవో నరేంద్ర చారి మాట్లాడుతూ, "ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి. ఉద్యోగ కర్తవ్యంలో సమయపాలన పాటిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత రాములు సార్కే దక్కింది" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాములు దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు.కార్యక్రమంలో ఎంఈవో నరేంద్ర చారి, గ్రామ ప్రత్యేక అధికారి జాలి రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖ తరఫున జగదీశ్వర్, డిఆర్పి కిరణ్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ సిరికొండ భాగ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ అప్పిడి సంతోష్ రెడ్డి, మాజీ హెచ్ఎం నలుమార్చి సుదర్శన్, మాజీ సర్పంచ్ అర్చనపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధూళికట్ట గ్రామపంచాయతీ షెటర్స్ వేలం

**ఐదు షట్టర్లకు బహిరంగ వేలంపాట**



దూళికట్ట గ్రామపంచాయతీ షట్టర్స్ వేలం వేస్తున్న అధికారులు

**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ షెట్టర్లకు బహిరంగ వేలంపాట జరిగింది.గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య అధ్యక్షతన, ఎంపీవో కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఐదు షట్టర్లు కేటాయించబడ్డాయి. పెద్దపల్లి లత, గొల్లే భూమేశ్, మొగురం అంజయ్య, భూసారపు తిలక్, ఎర్ర శేఖర్ బహిరంగ వేలంపాట ద్వారా షట్టర్లను పొందారు.ఈ షట్టర్ల ద్వారా గ్రామపంచాయతీకి ఏడాదికి రూ.96,000 ఆదాయం రానుందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, వార్డు సభ్యులు, వేలంపాట దారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



**చిట్యాల మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిట్యాల మండలం అరెగూడెం గ్రామంకి చెందిన ఆరూరి పుష్పలత అనారోగ్యం వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందడంతో గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ సుందర్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ సహాయనిధి పథకం కింద చెక్కు మంజూరి చేయించి బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు.ఈ వార్డ్ మెంబర్ నందిపాటి శ్రీనివాస్,ఆరూరి రాములు,నాగంపల్లి కిషోర్ ఆరూరిశ్రీనివాస్ మురాల శేఖర్, బేంబిరి శ్రీను,మోకిడి నర్సింహా, సాపిడి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల ధర్నా

**ఎలిగేడు బస్టాండు ఆవరణలో ఆందోళన**



ఎలిగేడు మండల కేంద్రంలో ఆశ కార్యకర్తల ధర్నా

**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆశా కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా నిర్వహించారు.సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మాట్లాడుతూ, "తమ డిమాండ్ల సాధనకోసం శాంతియుతంగా పోరాడుతుంటే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. కనీస వేతనం రూ.18 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రెండేళ్లు గడిచినా అమలు చేయలేదు" అని విమర్శించారు.తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాన్ని ఆపబోమని, అవసరమైతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు.కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సరోజ, కార్యదర్శి లక్ష్మి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, కళావతి, సృజన, పద్మ పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరి

**-లోకపేటలో 122 పశువులకు టీకా**



**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారిణి ఝాన్సీ సూచించారు.ఎలిగేడు మండలంలోని లోకపేట గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని 122 పశువులకు టీకా వేశారు.పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ రాధ గంగా జమున--వేణుమాధవరావు, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు భరోసా అగ్నిమాపక కేంద్రం




**ఆమనగల్లు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాలుగు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని గతంలో కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి విన్నవించిన నేపథ్యంలో సోమవారం పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సంబంధిత అధికారులు కసరత్తు ఆరంభించారు. పట్టణంలోని అటవీశాఖ పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి వివరాలు సేకరించడం పట్ల కెఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణ ప్రజలు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్న ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో పనులు చకచకా జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రజల భద్రతకు భరోసా అని జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని బాబా కోరారు.

# రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు



సహకార సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ అనిల్ కుమార్



పాల్గొన్న రైతులు

## -ఎలిగేడు పిఎసిఎస్ సర్వసభ్య సమావేశం

**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామని పిఎసిఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కె. అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 7 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో 5000 మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని వెల్లడించారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రైతులకు గోల్డ్ లోన్ ఇచ్చేందుకు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా 40 శాతం సబ్సిడీతో డ్రోన్లను తెప్పించి రైతులకు అతి తక్కువ ధరలకే కిరాయికి ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం సుల్తానాపూర్, బుర్హాన్‌మియాపేట గ్రామాల్లో ఎరువుల పంపిణీ గోదాములు ఏర్పాటు చేయాలని రైతులు కోరగా, సరైన సౌకర్యాలు ఉంటే షాపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈఓ కేశెట్టి విక్రమ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ పట్టాను రద్దు చేయాలి

## -తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు



**ఎలిగేడు, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కుడుదుల నర్సింగం వారసులు సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కుడుదుల నర్సింగం పేరున ఉన్న భూమి పట్టాను అక్రమంగా కుడుదుల మల్లమ్మ అలియాస్ కెంగర్ల మల్లమ్మ పొందారని వారు ఆరోపించారు. వారసులు కుడుదల భాగ్యమ్మ, కుడుదుల చంద్రయ్య, కుడుదుల మల్లయ్య, కుడుదల స్రవంతి, కుడుదల శంకర్ మాట్లాడుతూ, ఎలిగేడు గ్రామ శివారులోని 919, 62, 63, 893, 894, 39 సర్వే నంబర్లలో గల భూమి నిజమైన వారసులైన తమకు కాకుండా, ఇంటిపేర్లు మార్చుకొని వంశవృక్షం తప్పుడు వివరాలు నమోదు చేయించి మల్లమ్మ అన్యాయంగా పట్టా పొందిందని తెలిపారు. రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమంగా పట్టా పొందిన మల్లమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ పట్టాను రద్దు చేయాలని వారు కోరారు.

# క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపుల నిబంధనపై లారీ యజమానుల నిరసన

**పెద్దపల్లి, మార్చి 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రవాణా వాహనాలకు తప్పనిసరిగా అమలు చేస్తున్న క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపులు మరియు పెరిగిన ఫిట్నెస్ ఛార్జీలను ఉపసంహరించాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారి పై లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు బారీ, రామగుండం ఏరియా లైన్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే డీజిల్ ధరలు, విడిభాగాల ఖర్చులు, త్రైమాసిక పన్నులు, టోల్ చార్జీలు, పెరిగిన ఫిట్నెస్ ఛార్జీలతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటికి తోడు కొత్త నిబంధన అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిఫ్లెక్టివ్ టేపుల వల్ల కలిగే ప్రయోజనం కంటే వాటి సేకరణలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యజమానులు ఈ నిబంధనల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం



వెంటనే ఈ నిబంధనను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న లారీ యజమానులతో ట్రాఫిక్ సీఐ అనిల్, ఎస్ఐ మల్లేష్ మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం లారీ యజమానులు పెద్దపల్లి ఎంవిఐ స్వప్న, ఏఎమ్‌విఐ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి. ఆరిఫ్ అలీ, సెక్రటరీ బాలాజీ, ఖాజోద్దీన్, బసంత్ నగర్ అధ్యక్షుడు మేకల సదానందం, ప్రధాన కార్యదర్శి మాదాసు చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల నరసయ్య, గోదావరిఖని అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, సుల్తానాబాద్ అధ్యక్షుడు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి బుర్కా సతీష్, వైస్ ప్రెసిడెంట్ డి. శ్రీనివాస్, ధర్మారం అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన దంపతులు



**పెద్దపల్లి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెద్దపల్లి జిల్లాకు చెందిన వరహగిరి శైలజ, భర్త వెంకటరావు దంపతులు ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు తిరిగి అప్పగించారు. తమ పిల్లలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడిన నేపథ్యంలో ఈ గృహం అవసరం లేదని భావించి, వేరే నిరుపేద కుటుంబానికి కేటాయించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, అవసరం లేకపోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని, ఇలాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల సమక్షంలో పర్యావరణ అవగాహన సదస్సు

**కరీంనగర్ రూరల్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు చామనపల్లి గ్రామ పంచాయతిని సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా చెత్త నుండి సంపద అనే అంశంపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామంలో చెత్త సేకరణ, వర్గీకరణ విధానాలను వివరించడంతో పాటు కంపోస్ట్ చెరువు తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సేంద్రీయ చెత్తతో ఎరువు తయారీ విధానం వారికి ప్రాయోగికంగా తెలియజేయబడింది. ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, రీసైక్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల పెంపకం, పర్యావరణ



పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీసీ ఫీల్డ్ విజిట్ కోఆర్డినేటర్ సుర్యకాంత్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ రమేష్, ఈకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ నల్ల మనోజ్ కుమార్, అధ్యాపకులు రవళి, కృష్ణ, అధ్యా సుల్తానా, ఏకాంబరం, ఫల్గునార్ పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యర్థాల సమర్థ నిర్వహణ ప్రకృతిలో సమతుల్యత సాధించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. డాక్టర్ నల్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగం ద్వారా మానవ ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చని సూచించారు. గ్రామ పంచాయతి అధికారులు విద్యార్థుల చురుకైన పాల్గొనడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాభావాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో పర్యావరణ సంరక్షణకు కట్టుబడి ఉండాలనే సంకల్పాన్ని కలిగించింది.

# భూమి అడ్వాన్స్ డబ్బులపై కలెక్టర్‌కి ఫిర్యాదు




**పెద్దపల్లి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఓడ్నాల తిరుపతి (తండ్రి కోటయ్య) 2021లో ఇంటి నిర్మాణం కోసం రెండు గుంటల భూమి కొనుగోలు చేయడానికి కొమ్మ మల్లేశం (తండ్రి కొమురయ్య) వద్ద రూ.1 లక్ష అడ్వాన్స్ ఇచ్చారు. అయితే రిజిస్ట్రేషన్ చేయకుండా, అదే భూమిని అధిక ధరకు వేరే వారికి అమ్మారని తిరుపతి ఆరోపించారు. ఐదు సంవత్సరాలుగా పంచాయతీలు జరుగుతున్నప్పటికీ, మాజీ ఎంపీటీసీ భర్త కొమ్మ ప్రసాద్ యాదవ్, ప్రస్తుత సర్పంచ్ భర్త మచ్చ యాదగిరి డబ్బులు తిరిగి ఇస్తామని కాలయాపన చేశారని, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఇవ్వమని, ఏం చేసుకుంటారో చేసుకోమని బెదిరిస్తున్నారని తిరుపతి భార్య లత కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అడ్వాన్స్ డబ్బులు ఇప్పించి, బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

# టీచర్లందికీ ఒకటోతేదీనే జీతాలు ఇవ్వాలి

## మండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయు జీతాలపై ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్ మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అన్నిశాఖలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చే ఆలోచన చాలా మంచిదన్నారు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య. మండలిలో సోమవారం ప్రవేశ పెట్టిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ (రద్దు) బిల్లుపై మాట్లాడిన ఆయన.. వివిధశాఖలు విడివిడి



ఉండటం వల్ల కొంత కన్ఫ్యూజన్ ఉండేదన్న ఆయన.. ఇప్పుడు ఈ బిల్లు ద్వారా అన్నిశాఖలను ఒకే మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చేలా స్ట్రీమ్ లైన్ చేయడం శుభపరిణామం అన్నారు. ఈ బిల్లును స్వాగతిస్తున్నామన్న ఆయన.. అలాగే విద్యాశాఖ పరిధిలో101 పద్దతిలో వేర్వేరు తేదీలలో వేతనాలు చెల్లింపుల సమస్యలున్నాయనీ.. ఈ సమస్య కూడా పరిష్కరించి టీచర్లందికీ ఒకటోతేదీనే జీతాలు అందేలా చూడాలని సూచించారు మల్క కొమరయ్య.

## ఆశా వర్కర్లకు బీఆర్ఎస్ మద్దతు



**పెద్దపల్లి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆశా వర్కర్లకు 18,000 ఫిక్స్‌డ్ వేతనం, పిఎఫ్, ఇతర సంక్షేమ ప్రయోజనాలు వెంటనే అమలు చేయాలని పెద్దపల్లి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.నేడు పెద్దపల్లి బస్టాండ్ వద్ద ఆశా వర్కర్లు రాజీవ్ రహదారిపై ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ తరఫున సంఘీభావం తెలుపుతూ, ఆశా వర్కర్ల పోరాటం పూర్తిగా న్యాయసమ్మతమని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శిస్తూ, ఆశా వర్కర్లకు సక్రమంగా జీతాలు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆశా వర్కర్ల జీతాలను పలుమార్లు పెంచి 10,000 వరకు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆశా వర్కర్ల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలిపారు.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఆశా వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో ప్రకారం 18,000 ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని ఉప్పు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో రోజువారీ కూలీ మృతి



**కరీంనగర్ రూరల్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

దుర్శేడ్ గ్రామానికి చెందిన 63 ఏళ్ల మేడ హనుమాన్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.వెంకటేశ్వర వైన్‌షాప్‌లో కూలీగా పనిచేసే హనుమాన్లు, పని ముగించుకొని రాత్రి 9:30 గంటలకు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మోటార్‌సైకిల్ అతివేగంగా ఢీకొట్టింది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన మరణించారు. మృతుని కుమారుడు మేడ మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి శవపరీక్ష అనంతరం బంధువులకు శవాన్ని అప్పగించారు. దర్యాప్తులో మోటార్‌సైకిల్ నడిపిన వ్యక్తి గడిచిరోల్లు జిల్లా విలాస్ భీమయ్య అని గుర్తించారు. ప్రమాదం తర్వాత అతడు బండిని అక్కడే వదిలేసి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. అతడిని త్వరలో పట్టుకొని చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

## కుల వివక్ష నిర్మూలనపై అవగాహన సదస్సు



**పాలకుర్తి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

:పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షను రూపుమాపాలని పాలకుర్తి మండలం డిప్యూటీ ఎమ్మార్వో రాజేశ్వరరావు అన్నారు.ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని కోదండరామాలయంలో గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎమ్మార్వో మాట్లాడుతూ, దళితులు మరియు బడుగు బలహీన వర్గాల పౌరహక్కులను రక్షించడానికి ప్రతి ఏడాది మార్చి చివర్లో గ్రామంలోని అన్ని కుల సంఘాలను ఏకం చేసి కుల వివక్ష నిర్మూలనకు చట్టపరమైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.కులవివక్ష, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను రూపుమాపడం ద్వారా గ్రామాల్లో శాంతి, సామరస్యాలు పెంపొందుతాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారని పేర్కొన్నారు.ఈ సమావేశం ద్వారా గ్రామంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. అనంతరం కోదండరామాలయంలో అన్ని కుల సంఘాలతో కలిసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్ కుమార్, వీఆర్వో లక్ష్మీనారాయణ, బసంత్‌నగర్ ఏఎస్ఐ మునిరుద్దిన్, కార్యదర్శి కోడిజుట్టు సుభాష్, డా. బీఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గాలిపెల్లి వెంకటస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భారతానికి వెన్నుముక మన వ్యవసాయ రంగం”





భారతాన్ని తన భుజాలపై వేసుకొని కోట్లాదిమందికి జీవనోపాధి కల్పిస్తూ భారత వృద్ధిలో క్రియాశీల పాత్ర పోషించే రంగం మన వ్యవసాయ రంగం. రోజు రోజుకి అంతకంతకు విస్తరిస్తూ 2050 నాటికి ప్రపంచ జనాభా 1000 కోట్లు చేరే దిశగా పరుగెడుతున్న తరుణంలో వ్యవసాయ రంగం లో సమూల మార్పులు జరిగే అవశ్యకత చాలా ఉంది ఎందుకంటే ప్రపంచ దేశాలన్నిటికీ సేవల రంగం కన్నా అతి ముఖ్యమైన రంగం వ్యవసాయ రంగం. డిజిటల్ రైతు సేవలు, అత్యాధునిక వ్యవసాయ రంగం, కృత్రిమ మేధను అన్వయహించడం, ప్రగతి శీల ఆహారోత్పత్తి పంపిణీ అనేవి నేటి ఆధునిక వ్యవసాయ రంగ విప్లవానికి దోహదం చేస్తున్నవి. పర్యావరణ సమతుల్యత సాధించడం ఆహార భద్రత మెరుగు పరచడం జీవనోపాధి సాధించడం అత్యంత కీలక అవశ్యకం. ప్రపంచ జనాభా లో" మన భారత దేశం యొక్క వాటా 18 శాతం ఉంది" కానీ వ్యవసాయ రంగం యొక్క విస్తీర్ణంలో మాత్రం కేవలం 2.4 శాతం మాత్రమే ఉండడం అనేది ప్రపంచీకరణ లో వెనుకబాటు తనానికి సూచకంగా ఉంది అత్యధిక మంది వ్యవసాయ రంగం పైనే ఆధారపడి ఉండటం వల్ల కార్మిక ఉపాధి లో తగినంత ఆర్థిక సమతుల్యత ఆర్థిక భరోసా లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం పై ఆధారపడే వ్యవస్థలకు కానీ జనాలపై ప్రభావం పడుతుంది. మన భారత దేశంలో అత్యధిక శాతం మంది కేవలం "చిన్న భూకమతాలు కలిగిన వారే అధ్యదిక శాతం ఉన్నారు " మన "దేశ జీడీపీ లో వ్యవసాయ రంగం యొక్క వాటా 18 శాతం గా ఉంది కానీ అత్యధిక ఉపాధి కల్పనలో మాత్రం అత్యధిక శాతం ఉంది దీన్ని బట్టి వ్యవసాయ రంగం యొక్క ప్రాముఖ్యత ఏమిటో మనం గమనించాలి.1970బి71 లో ఉన్న ఆహార ధాన్యాల దిగుబడి 109 మిలియన్ టన్నులు ఉంటే 2024బి25 నాటికి 358 మిలియన్ టన్నులు చేరింది . భారత్ దేశ వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు ఊతం ఇచ్చి భూ కమతాల పరిమాణం తగ్గించి హెచ్చు తగ్గులు లేకుండా చేసే అవసరం చాలా ఉంది." ప్రస్తుతం ఉన్న ప్రపంచ మార్కెట్ విలువ 2030 నాటికి 50 బిలియన్లకు చేరే అవకాశం ఉంది కనుక వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు ఊతం ఇచ్చి ధాన్యం కొనుగోలు పంట మార్పిడులు గిట్టు బాటు ధర కల్పించి భారతాన్ని నూతన వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు ఊతం ఇవ్వాలి . వ్యవసాయ రంగంలో రైతులు అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు అనగా జీపీఎస్ సిస్టమ్ వాడటం, ఎరువులు వినియోగానికి యాంత్రిక విధానాన్ని పాటించడం, డ్రోన్ వ్యవస్థల ద్వారా మందుల పిచికారీ చేయడం , ఈ నామ మార్కెట్ వ్యవస్థల ద్వారా పంట కొనుగోలు కేంద్రాలు ఆన్లైన్ వ్యవస్థల అనుసంధానం వల్ల టెక్నాలజీ రంగం విసృతంగా వ్యవసాయ రంగం పై ప్రభావం చూపుతుంది. ఆహారధాన్యాల దిగుబడి కోసం ప్రభుత్వం చిరుధాన్యాల ఉత్పత్తికి "శ్రీ అన్న" బోధిస్తూ ప్రపంచానికి పరిచయం చేసింది మన దేశం 2025 నాటికి 180 లక్షల టన్నుల దిగుబడితో ప్రపంచలో అతిపెద్ద చిరుధాన్యాల ఉత్పత్తి దారుగా మన భారత దేశం నిలిచింది. అదేవిదంగా జాతీయ ఆవిష్కరణల సంస్థ , మొక్కల రకాలు, రైతుల హక్కుల ప్రాధికార చట్టం ను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేశారు. "జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన కి జై అనుసంధానం" చేశారు అంటే వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్య ఉందో అర్థం అవుతుంది.

"వ్యవసాయ రంగం సవాళ్లు"?

పీఎం కిసాన్ నిధుల ద్వారా కొంత ఆర్థిక సహాయం రైతులకు ఉన్నప్పటికీ సరైన గిట్టు బాటు ధర సకాలములో లేకపోవడం , పంట కొనుగోలులో ఆలస్యం, గుత్తేదారులకి ఆస్కారం గా ఉండటం, ప్రకృతి విపత్తుల అకాల పంట నష్టాలు రైతన్నల ఎదుగుదలకు దేశ వ్యవసాయ రంగానికి ఆటంకాలు. సరైన సమయం లో భూ సారా పరీక్షలు చేయకపోవడం వల్ల రైతులు పంట నాటే సమయాలలో అధిక దిగుబడి వచ్చే పంటలు నాటే ఆస్కారణకి ఇబ్బంది అవుతుంది. దేశానికి వెన్నుముక గా నిలుస్తూ దేశాన్నే నడిపించే వ్యవసాయరంగాన్ని విస్మరించే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయొద్దు. కృత్రిమ మేధను వాడి"భారత్ విస్తార్ " ద్వారా మత్స్య రంగం, జలాశయం ల అభివృద్ధి, అమృత సరోవరుల అభివృద్ధి చేసి నూతన ఆధునిక కల్పనలు సృష్టించి నూతన వ్యవసాయ విప్లవానికి నాంది పలికి దేశాన్ని "2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా పని చేయించడం చాలా అవసరం."

### వ్యాసకర్త

గోరుపాటి శంకర్
అసోసియేట్ ఎడిటర్
రచయిత, జర్నలిస్టు



## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు.మందులపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి అభిలాష్, తన యజమాని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన దుర్గం మహేష్ ఆదేశాల మేరకు ఇసుకను దొంగలించి రవాణా చేస్తుండగా, బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అలవేణి సంతోష్, గట్టేపల్లి గ్రామానికి చెందిన అంబాల శ్రవణ్ కుమార్ కూడా మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా, బొమ్మకల్ లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు.పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇదివరకు అక్రమ ఇసుక రవాణా చేసి పట్టుబడి మళ్లీ అదే పనిలో నిమగ్నమైన వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, ట్రాక్టర్లను వేలం వేయడానికి ఎంఆర్ఓకు అందజేస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ బస్టాండ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్టాండ్ కంట్రోలర్ లకావత్ హరికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ మాట్లాడుతూ, బస్టాండ్‌లో ప్రయాణికుల వస్తువులు తరచూ దొంగతనాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లు, పర్సులు, బ్యాగులు దొంగతనానికి గురైన ఘటనలు అనేకసార్లు జరిగాయని తెలిపారు.గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ, ఇప్పటివరకు రవాణా శాఖ సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆధునీకరణ పేరుతో అభివృద్ధి చేసిన బస్టాండ్‌లో కనీస భద్రతా సదుపాయాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ప్రయాణికుల భద్రత కోసం వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, భద్రతా సిబ్బందిని పెంచాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాస శ్రీనివాస్, బొజ్జ హరీష్, కందుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 225 ఫిర్యాదులు, వినతులు స్వీకరించబడ్డాయి. వృద్ధుల వద్దకే స్వయంగా వెళ్లి వినతిపత్రాలను స్వీకరించిన కలెక్టర్, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజల సమస్యలను ఆలకించి, తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే. మహేశ్వర్, డీఆర్‌డీఓ శ్రీధర్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌ఎస్ పరీక్షలు

**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



భారత విద్యా మంత్రిత్వ శాఖ, ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ ఎఫ్‌ఎల్‌ఎస్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30, 31 తేదీల్లో జరుగుతున్నాయి. 3వ తరగతి విద్యార్థుల ప్రాథమిక చదువు, లెక్కల సామర్థ్యాలను అంచనా వేయడం ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలోని 407 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలలో 12 మంది విద్యార్థులను నమూనాగా ఎంపిక చేసి రెండు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తున్నారు. డిజిటల్ ట్యాబ్‌లతో పాటు అవసరమైన చోట రాతపరీక్ష పత్రాలు కూడా అందుబాటులో ఉంచారు. భాష, సంఖ్యాజ్ఞానంలో అంశాలను పరీక్షించే విధంగా ప్రశ్నాపత్రం రూపొందించారు. డైట్ కరీంనగర్ ఉపాధ్యాయులకు ముందుగా శిక్షణ ఇచ్చి, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల సహకారంతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రాథమిక సామర్థ్యాలను అంచనా వేసి భవిష్యత్ విద్యా ప్రణాళికల రూపకల్పనకు ఈ సర్వే కీలకంగా నిలవనుంది.

## వారసంతకు వార్షిక ధర కేటాయింపు



**పాలకుర్తి, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పాలకుర్తి మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంతకు 2026-27 సంవత్సరానికి వార్షిక అప్‌సెట్ ధరను పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ రాజ్ శాఖ అధికారి దేవకీ దేవి ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాలకుర్తి గ్రామ పంచాయతీకి రూ.13,077ను వార్షిక ధరగా నిర్ణయించారు. గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు ప్రకటనలో, మంగళవారం ఒక సంవత్సరం గడువుకు వారసంత వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కారోబార్ లావణ్య కోరారు.

## ఘనంగా ప్రారంభమైన జెఎస్ఆర్ చలివేంద్ర కేంద్రాలు

**హుస్నాబాద్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు జెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత త్రాగునీటి చలివేంద్ర కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, మల్లె చెట్టు, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, ఇతర నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా జెఎస్ఆర్ సూచనల మేరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉచితంగా శుద్ధి చేసిన చల్లటి నీటిని ప్రజలకు అందించడం అభినందనీయమని తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజల కోసం ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలకు ఆరోగ్యానికి హితమైన శుద్ధి చేసిన నీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, బాటసారులు, ఆటో డ్రైవర్లు, కూలీలు, సామాన్య




ప్రజలు సులభంగా ఉపయోగించుకునేలా ప్రధాన కూడళ్లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, కురిమెల్ల శ్రీనివాస్, కాయిత అరుణ్ రెడ్డి, వరియోగుల అనంతస్వామి, పోలోజు రవీందర్, కాదాసు నర్సయ్య, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారి, కార్యదర్శి బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, శక్తి కేంద్ర ఇంచార్జీ నారోజు నరేష్, నాయకులు అబ్బిడి లింగారెడ్డి, వెంకట రమణ, సుద్దాల నరేష్, భూక్యా నవీన్ నాయక్, గడిపె శ్రీధర్, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికై సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**హుస్నాబాద్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజల ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు శ్రీకారం చుట్టడం విశేషంగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే మట్టి, చెత్త సమస్యలను తగ్గించడంలో ఈ రోడ్లు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని, గ్రామాన్ని శుభ్రంగా, సుందరంగా అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా



సౌకర్యం మెరుగుపడి విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు సులభంగా ప్రయాణించగలరని అన్నారు. భవిష్యత్తులో డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వరణ్ కుమార్, వార్డ్ మెంబర్లు పొన్నబోయిన రాజు, వేల్పుల కార్తీక్ జోష్న, పొన్నబోయిన రేణుక, పుట్ట శ్రీశైలం, గ్రామ సెక్రటరీ ప్రసాద్, మాజీ సర్పంచ్ తరాల లత మహేందర్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల అరెస్టులపై ఆగ్రహం

**హుస్నాబాద్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




అక్కన్నపేట మండలంలో మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్ర విమర్శలకు గురైంది. 2019--2023 కాలంలో గ్రామాభివృద్ధి పనుల కోసం అప్పులు తెచ్చుకున్నప్పటికీ ఇప్పటికీ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో తమ సమస్యలపై చర్చించకపోవడం బాధాకరమని, ఎన్నికల ముందు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని వారు ఆరోపించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో తెల్లవారుజామునే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఈ చర్యలు జరుగుతున్నాయని, తాము చేసిన అభివృద్ధి పనులను ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తోందని కానీ తమ సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచులు విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహారశైలి పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని, గ్రామీణ ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారని హెచ్చరించారు.

## అపూర్వ ఫ్లోరేట్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలినీ కలెక్టర్కి ఫిర్యాదు

**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో బోర్డులు ప్రదర్శిస్తున్న అపూర్వ ఫ్లోరేట్స్ పాఠశాలపై చర్యలు తీసుకుని గుర్తింపును రద్దు చేయాలని కలెక్టర్‌కు పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ వినతిపత్రం సమర్పించింది. పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, విద్యను వ్యాపారం చేసి లాభాల కోసం నిబంధనలు తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ మేనేజ్మెంట్‌పై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ స్కూల్, టెక్నో ఒలింపియాడ్ పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తే పాఠశాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విద్య అందరికీ సమానంగా అందాలని, కానీ అధికారులు కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తూ పేద విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మార్చుతున్నారని ఆయన విమర్శించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ డీఈవో కార్యాలయం అవినీతి మత్తులో నిద్రపోతుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ పాఠశాలలకు మద్దతు ఇస్తున్న అధికారులను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని, లేనిపక్షంలో డీఈవో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నగర కార్యదర్శి మొగిలి శివ, జిల్లా సహాయ కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**-- కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్‌ను బలోపేతం చేయాలని, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి అనాధ పిల్లలను గుర్తించి వసతి గృహాలలో చేర్పించాలని సూచించారు. బాల కార్మికులను గుర్తించి వారికి తగిన పారితోషకం అందించడంతో పాటు 14 ఏళ్ల లోపు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, ఇటుక బట్టీల దగ్గర పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌కు వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారిడి యాదయ్య, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. నస్పూర్‌లో జరిగిన గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి గాను రూ.1.06 కోట్లు పార్ట్ 1 బడ్జెట్, రూ.1.66 కోట్లు పార్ట్ 2 బడ్జెట్ ప్రతిపాదించామని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలు సమకూర్చడం, వేసవి దృష్ట్యా గ్రంథాలయాల్లో ఎ.సి., కూలర్లు, సీసీ కెమెరాలు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు, కంప్యూటర్లు, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు ఏర్పాటు చేయాలని, ఆర్ఆర్ఆర్ఎల్ఎఫ్ పథకం నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా సంబంధాల అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల ధర్నా అడ్డుకున్న పోలీస్ శాఖ



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భవన నిర్మాణ కార్మికుల చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ ధర్నాను ప్రభుత్వం అడ్డుకుంది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.కార్మికుల కార్డులు రెన్యువల్, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని, సిఎస్సి సంస్థ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించిన జీఓ నెం.12ను సవరించాలని కార్మికులు డిమాండ్ చేశారు.ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం అన్యాయం అని, కార్మికులకు ఎటువంటి ప్రయోజనం లేని సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో వందల కోట్లు వృథా చేస్తున్నారని ఆరోపించారు. 28 లక్షల మంది కార్మికుల్లో 15 లక్షల మందికి మాత్రమే కార్డులు రెన్యువల్ చేసి, ఒక్కొక్కరికి రూ.2,309 చొప్పున రూ.346 కోట్లను బీమా కంపెనీలకు బదిలీ చేశారని తెలిపారు.ప్రస్తుతం అమలులో ఉన్న 12 స్కీముల్లో 3 మాత్రమే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చి, మిగతా స్కీములను కార్మికులకు అందించడం లేదని విమర్శించారు. పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేసి, రెన్యువల్ కాని 13 లక్షల కార్మికుల కార్డులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను పరిష్కరించకపోతే మార్చి 30న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని యూనియన్ ప్రకటించింది.

# గణేష్ బెంగళూరు బేకరీపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రేకుర్తి ప్రాంతంలోని గణేష్ బెంగళూరు బేకరీలో ఆహార నాణ్యతపై ఫిర్యాదు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు సాయంత్రం 4 గంటలకు తనిఖీలు నిర్వహించారు.ఎగ్ పఫ్‌లో దుర్వాసన వస్తోందని వచ్చిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు పరిశీలించగా, కేకులు మరియు ఎగ్ పఫ్ తయారీలో పాడైన, పగిలిన గుడ్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. వంటగది ప్రాంతం పూర్తిగా అశుభ్రంగా ఉండగా, మైదా, క్రీమ్, షుగర్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. నిల్వ ప్రాంతంలో 14 ట్రేలు పగిలిన గుడ్లు మొత్తం 420 ఉండగా, వాటి కారణంగా వంటగది ఈగలతో నిండిపోయింది.పగిలిన గుడ్లతో తయారు చేసిన రూ.7000 విలువైన కేకులు, మొత్తం రూ.9000 విలువైన నిల్వను అక్కడికక్కడే తొలగించి పారవేశారు. బేకరీ ఫస్సై లైసెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేసి, అవసరమైన సరిదిద్దే చర్యలు తీసుకునే వరకు నిర్వహణకు అనుమతి ఇవ్వలేదు.ఫుడ్ సేఫ్టీ చట్టం 2006 ప్రకారం నిబంధనల ఉల్లంఘనపై అడ్జుడికేషన్ చర్యలు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# శాతవాహనలో ఆహార విశ్లేషణపై కార్యశాల



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : శాతవాహన విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆహార విశ్లేషణ పద్ధతులు అనే అంశంపై రెండు రోజుల కార్యశాల జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రమాకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము వినియోగించే ఆహారంలో సమతౌల్యత ఎలా ఉందో తెలుసుకోవాలని, మంచి ఆహారపు అలవాట్లు పెంచుకోవాలని సూచించారు.పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆహార విశ్లేషణ అనేది ఆహార పదార్థాల రసాయన, భౌతిక, సూక్ష్మజీవ లక్షణాలను అధ్యయనం చేసే ప్రక్రియ అని, దీని ద్వారా నాణ్యమైన ఆహారాన్ని గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించడమే ఈ విశ్లేషణ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫుడ్ సైన్స్ విభాగాధిపతి, కార్యశాల కన్వీనర్ డాక్టర్ జోసఫ్ రాజు మాట్లాడుతూ ఆహారాన్ని నిల్వ చేసే పద్ధతులు, ప్యాకేజింగ్ ప్రమాణాలపై మెలకువ అవసరమని, దీని వలన ఆహార భద్రత ఏర్పడి వినియోగదారులు ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని తెలిపారు.ఈ కార్యశాలలో ఎస్.ఆర్.ఆర్ కళాశాల విద్యార్థులు, జగిత్యాల గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. అధ్యాపకులు డాక్టర్ హరిత, సాయిప్రియ కూడా హాజరయ్యారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరం పాటుపడాలి



**సిద్ధిపేట, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ జీరో వేస్ట్ డే సందర్భంగా సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని మై భారత్ కార్యాలయంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని మై భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి జి. కిరణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతికి మనం ఇవ్వగలిగే గొప్ప బహుమతి వ్యర్థాలను తగ్గించడం అని, సమాజంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ యువజన సంఘాలు వ్యర్థ రహిత కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.సంకల్ప సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్లాస్టిక్ కవర్లు చేరుతున్నాయని, వాటి బదులుగా జూట్ బ్యాగ్‌ల వినియోగాన్ని పెంచాలని ప్రజలను కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.ప్రకృతి సహజమైన వస్తువులను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని, తమ సంస్థ గత రెండు దశాబ్దాలుగా విద్యార్థులు, ప్రజల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించే వరకు చైతన్య కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజ్యోతి యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొంతల సత్యనారాయణ, సంకల్ప సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మెరుగు కనకరాజు, రాష్ట్రస్థాయి యూత్ అవార్డు గ్రహీత దొమ్మాట రాజు, కొమరవెల్లి స్వాతి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు ఆమోదంపై సంబరాలు




**ఆమనగల్లు, మార్చి 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర మండలి అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం తెలపడంపై ఆమనగల్లు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులంతా సంబరాలు నిర్వహించారు. స్వీట్లు తినిపించుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, హత్యలు, పోలీసుల దౌర్జన్యాలను అరికట్టాలని న్యాయవాదులు పోరాటాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని ఇటీవల ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఆమనగల్లు కోర్టు నుండి హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడి కోసం పాదయాత్రతో కార్యక్రమాన్ని మొదలుపెట్టి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే మంత్రిమండలి ఈ బిల్లును ఆమోదించటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లకు ఆమనగల్లు బార్ అసోసియేషన్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, విజయ్ కుమార్ గౌడ్, కానం గణేష్ గౌడ్, కొప్పు కృష్ణ, సంతోష్, మధు గౌడ్, మల్లేష్, దేవేందర్, శేఖర్, సర్దార్ నాయక్, ప్రభు నాయక్, ఆంజనేయులు, రాజు, మహేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# పట్టా భూమి కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**హుస్నాబాద్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కంసాని రాజిరెడ్డి తన భూమిని ఎడమల రాజిరెడ్డి తండ్రి బాల్ రెడ్డి అక్రమంగా కబ్జా చేశాడని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.తన ఫిర్యాదులో గ్రామంలో కొంత భూమి అమ్ముకున్నప్పటికీ, తనకు సంబంధించిన భూమిని కూడా కబ్జా చేశారని పేర్కొన్నారు. తనకు తెలియకుండా దొంగ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు.తన సమస్య పరిష్కారం అయ్యే వరకు రిజిస్ట్రేషన్ చేయకుండా గ్రామంలో విచారణ జరిపి న్యాయం చేయాలని, తన భూమిని తిరిగి అప్పగించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే అక్రమంగా భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయ వృత్తి ఆదర్శం

**- పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, మార్చి 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో విధులు నిర్వహించి, ఎందరో విద్యార్థుల ఉన్నత స్థాయికి ఎస్.ఏ తెలుగు ఉపాధ్యాయురాలు అనంతుని విద్యావతమ్మ నిలిచారని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు విద్యావతమ్మ పదవి విరమణ, ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది భావి భవిష్యత్తుకు మార్గదర్శకులుగా రూపొందించే బాధ్యత వహిస్తున్న ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థికి విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయురాలు విద్యావతమ్మ కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ ఎంగలి భాగ్యమ్మ రఘు, సింగంపల్లి సర్పంచ్ శానమోని సత్యం మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు కర్ణ భార్గవి, సత్యవాణి, శారద, శోభన, సరళ, రజిత, బాబులాల్, కనకదుర్గ, పద్మ, ఉమావతి, రాధిక, దీప్తి, జయసుధ, అమరావతి, సుశీల మరియు రామన్న మిత్ర మండలి శ్రీను నాయక్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ఆమనగల్లు, మార్చి 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండలంలోని మక్త మాదారం గ్రామానికి చెందిన నింగ్యారి మైసయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం నింగ్యారి మైసయ్య మరణించారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మహబూబ్ నగర్ డిసిసిబి డైరెక్టర్, అమనగల్, కడ్తాల్ మండలాల పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్త కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. శ్రీ గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5000/- ఆర్థిక సహాయం అందించారు. గంప లక్ష్మయ్య ట్రస్టు ద్వారా మండలంలో మృతి చెందిన వారికి ఆర్థిక సాయం అందజేస్తూ వారికి భరోసా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి నర్సింహా గౌడ్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బండి మంజుల చంద్రమౌళి, గ్రామ మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, వార్డ్ సభ్యులు బండి సరిత నాగేష్, మర్ల రవీందర్, అర్కోటం స్వామి, కట్ల మల్లేష్, రావిచెడు మహేష్, దుర్గాని జంగయ్య, దుర్గాని నరేందర్, దుర్గాని నర్సింహా, నింగ్యారి రవీందర్, జి వి జి టీం నింగ్యారి కిషన్, సిద్ది గారి సురేష్, సిద్దిగారి దాసు కొప్పు శ్రీకాంత్, అక్యారి చందు, అదిరాల మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసం చెరువులను కాపాడాలి

**- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, మార్చి 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భవిష్యత్ తరాల కోసం చెరువులను కాపాడుకోవలసిన అవసరం ఉందని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని సుర సముద్రం చెరువును ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో టీయుఎఫ్ఐడీసీ నిధులు 2.50 కోట్లతో చేపట్టే సుందరీకరణ పనులను అధికారులతో పరిశీలించారు. ప్రజలు బాధ్యతగా చెరువులను కాపాడుకోవాలని ఆయన సూచించారు. అభివృద్దే ధ్యేయంగా అందరిని సమన్వయం చేసుకొని పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్స్ ఎనుమల రమేష్, మొక్తల వెంకటయ్య, మాజీ వార్డు సభ్యులు పూసల సత్యం, కండె సాయి, ఎంగలి ప్రసాద్, గుండ్రాతి కుమార్ గౌడ్, గుద్దేటి శివ, బైకని యాదయ్య, సభావత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు చెక్

# అవగాహనతోనే సాధ్యం

**- సిపి గౌష్ ఆలం**




**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి వాటిని కచ్చితంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. సోమవారం అస్త్ర కన్వెన్షన్ హాలులో ఆటో డ్రైవర్లు, రాపిడో కెప్టెన్ల కోసం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ -- అలైవ్ మూడవ దశ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అజాగ్రత్తలే ప్రధాన కారణాలని తెలిపారు. ప్రమాదాల్లో 85 శాతం మంది పురుషులే మృతి చెందడం గమనార్హమని పేర్కొన్నారు. కరీంనగర్--హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి రహదారుల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డ్రైవర్లు డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడే సిపిఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రహవీర్ పథకం కింద రూ. 25,000 నగదు ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్లు సంజీవ్, కుమారస్వామి, కిరణ్ కుమార్, మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ లోకేష్, రాపిడో అసోసియేట్ మేనేజర్ దుర్గా రావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ మేళా



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీఓ సబితా, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, 9వ డివిజన్ కార్పొరేటర్ పాడిశెట్టి వసంతలక్ష్మి పాల్గొని దీపప్రజ్వలన చేశారు. ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ సెంటర్లు ఆటపాటలతో విద్యను బోధిస్తున్నాయని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ సెంటర్లలో లభించే పౌష్టికాహారం, బాలామృతం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సీడీపీఓ సబితా మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత, మొదటి వెయ్యి రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. పి ఉ జి ప్రతం మాస్టర్ ట్రైనర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధి అంశాలపై ఆటలు ఆడించారు. దాదాపు 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, పూర్వ గణిత భావనలు ప్రదర్శించి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. భాష, మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనాత్మకతపై పిల్లలకు వివరిస్తూ వారికీ రిపోర్ట్ కార్డులు సీడీపీఓ సబితా, సూపర్వైజర్లు అరుణ, నిర్మల, రేణుక చేతుల మీదుగా అందజేశారు. ప్రీ స్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బీసీ సతీష్, టీచర్లు స్వరూప, శ్యామల, సరితతో పాటు పిల్లలు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెవెన్యూ, టీఎన్జీవో, ఎక్సైజ్ కాంప్లెక్స్

# ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని వినతి




**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ రెవెన్యూ క్లబ్ కాంప్లెక్స్, టీఎన్జీవో భవన్ కాంప్లెక్స్, ఎక్సైజ్ కాంప్లెక్స్‌లకు కోట్ల రూపాయల ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే వసూలు చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, ప్రతి నెల లక్షల్లో కిరాయిలు వస్తున్నప్పటికీ ఈ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు పన్నులు ఎగ్గొడుతున్నారని విమర్శించారు. రెవెన్యూ క్లబ్ కాంప్లెక్స్‌లో 35 షటర్లు, రెవెన్యూ గార్డెన్, రిక్రియేషన్ క్లబ్ అద్దెల రూపంలో వచ్చే ఆదాయాన్ని అసోసియేషన్ లీడర్లు అవినీతికి, అక్రమాలకు వినియోగిస్తూ మున్సిపల్ కార్పొరేషన్‌కు కట్టాల్సిన పన్నులు దాదాపు 30 సంవత్సరాలుగా ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. ఎక్సైజ్, రెవెన్యూ కాంప్లెక్స్‌లలో అధికారులకు, వారి బినామీలకు షటర్లు కేటాయించి నెలకు 15--20 వేల రూపాయల అద్దె వసూలు చేస్తున్నప్పటికీ పన్నులు చెల్లించడం లేదని తెలిపారు. మున్సిపల్ అధికారులు, అసోసియేషన్ లీడర్లు కుమ్మక్కై ఇప్పటి వరకు కోటి రూపాయలకు పైగా రెవెన్యూ క్లబ్, 90 లక్షల టీఎన్జీవో, లక్షల రూపాయల ఎక్సైజ్ కాంప్లెక్స్ బకాయిలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని అన్నారు. సామాన్యుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ కరెంట్, నీటి కనెక్షన్లు కట్ చేస్తున్న అధికారులు ఈ కాంప్లెక్స్‌ల విషయంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాయితీలు ఇవ్వకుండా, పెండింగ్‌లో ఉన్న పన్నులను వసూలు చేసి అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. బద్రినేత, నాయకులు లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకత మనిషి మనుగడకు మూలాధారం

**మానేరు తీరం' ఆవిష్కరణలో డాక్టర్ దారం రఘురామన్**



**కరీంనగర్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్ని కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు ఎదురైనా మనిషి మనుగడను నిలబెట్టేది సృజనాత్మకతేనని ప్రముఖ వైద్యులు డాక్టర్ దారం రఘురామన్ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ రచించిన 'మానేరు తీరం' ద్విభాషా కవితా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "మానేరు తీరం కవితలు సౌందర్యాన్ని అలంకరించవు, సత్యాన్ని ఆవిష్కరిస్తాయి. వాటిలో ఆశ ఉంది, కానీ అది బతుకు ఆరాటం, పోరాటం మధ్యలో పుట్టిన ఆశ" అని పేర్కొన్నారు. తెలుగు--ఇంగ్లీష్ ద్విభాషా పుస్తకంగా వచ్చిన ఈ సంకలనం ప్రతి మనిషికి చెందినదే అని ఆయన అన్నారు. కరీంనగర్ పట్టణ కంఠాభరణమైన మానేరు నది ఒడ్డున దిగువ మానేరు ఆనకట్టపై జరిగిన ఈ ఆవిష్కరణలో అతిథిగా హాజరైన డాక్టర్ వుడుత చంద్రశేఖర్, ఆనంద్ సృజనాత్మకతను విశ్లేషించారు. సీనియర్ జర్నలిస్టు రావికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతర సాహితీ కృషి ఆనంద్‌ను నిలబెడుతోందని అన్నారు. కె.ఎస్. అనంతాచార్య మాట్లాడుతూ మానేరు తీరం ఆవిష్కరణ మానేరు ఒడ్డున జరగడం, ఆహ్లాదకర వాతావరణంలో జరగడం స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. సీనియర్ జర్నలిస్టు పి.ఎస్. రవీంద్ర తమ ఫిల్మ్ సొసైటీ ప్రయాణాన్ని వివరించారు. మాడిశెట్టి గోపాల్ సమన్వయం చేస్తూ, సమైక్యసాహితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడిందని గుర్తు చేశారు. కవి వారాల ఆనంద్ తన సాహితీ ప్రయాణాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు గాజుల రవీందర్, సంకేపల్లి నాగేంద్ర శర్మ, మెట్టు సుగేందర్, శ్రీపతి, పొయెట్రీ ఫోరం నిర్వాహకులు ఇందిరా రాణి, చందన తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయల విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం -ఒకరి అరెస్ట్



**మహేశ్వరం, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటి) బృందం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో భారీగా హాషీష్ ఆయిల్ స్వాధీనం చేశారు. ఒరిస్సా నుండి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 9.402 కిలోల హాషీష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. దీని విలువ సుమారు కోటి రూపాయలుగా అంచనా వేయబడింది. నిందితుడు కొరాబు చంటి బాబు (35, అల్లూరి సీతారామరాజు జిల్లా)ను అరెస్ట్ చేశారు. అతనితో పాటు రాజారావు (ఒరిస్సా) మరియు గుర్తుతెలియని వ్యక్తి పరారీలో ఉన్నారు. చంటి బాబు, రాజారావు వద్ద నుండి డ్రగ్స్ సేకరించి హైదరాబాద్‌లో సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో మార్చి 29 సాయంత్రం మహేశ్వరం గేట్ బస్టాండు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 పాలిథిన్ కవర్లలో హాషీష్ ఆయిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేశారు. చంటి బాబు గతంలో విశాఖపట్నం, అనకాపల్లి, కంచరపాలెం ప్రాంతాల్లో నాలుగు ఎన్‌డిపిఎస్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేస్తూ, యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా నిఘా ఉంచాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే మహేశ్వరం జోనల్ కంట్రోల్ 8712662664 లేదా డయల్ 100కు తెలియజేయాలని సూచించారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన అధికారులను పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ మరియు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

## చింతకుంట, ముష్టిపల్లి, జాకారం తండాలలో యథేచ్ఛగా ఇసుక దందా

### అక్రమ రవాణా అరికట్టాలని ప్రజల వినతి



**చౌదర్‌గూడా, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చౌదర్‌గూడా మండల పరిధిలోని చింతకుంట, ముష్టిపల్లి, జాకారం తండాల పరిసరాల్లో గత కొంతకాలంగా అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, "అనుమతులు లేకుండా రాత్రిపూట ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. విచ్చలవిడి ఇసుక తోడకం వల్ల వాగుల ఉనికి దెబ్బతింటోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ రవాణా కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనం నడుపుతున్న మందు బాబుకు రోడ్డు ప్రమాదం



**హుస్నాబాద్ , మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ అక్కన్నపేట చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన అందే బాలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం ప్రకారం మద్యం మత్తులో ఉన్న బాలయ్య రోడ్డుపై వెళ్తున్న లారీ వెనుక టైరు దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు చిక్కుకోవడంతో కాలు విరిగింది. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చౌరస్తాలో వైన్స్ షాప్ ఉండడం వల్ల తరచూ మద్యం సేవించి రోడ్లపై అల్లరి చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వైన్స్ షాప్ మరియు పర్మినెంట్ గదులను తొలగించి, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించి వైన్స్ షాప్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గాంధీ పార్క్ విడుదల

**-కూరగాయల మార్కెట్ తక్షణ వినియోగం డిమాండ్**
**-మహబూబాబాద్‌లో సిపిఐ నిరసన**




**మహబూబాబాద్, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో ఐదేళ్లుగా బందీగా ఉన్న గాంధీ పార్క్‌ను తక్షణమే విడుదల చేయాలని సిపిఐ 33వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గాంధీ పార్కులోని గాంధీ విగ్రహం ముందు ఆయన ఆధ్వర్యంలో నిరసన ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. రాజకీయ, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలకు ఉపయోగపడే గాంధీ పార్క్‌ను వెంటనే విడుదల చేయాలి" అని అన్నారు. అదేవిధంగా 2023లో ప్రారంభించిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను జాప్యం చేయకుండా తక్షణమే వినియోగంలోకి తేవాలని, వ్యాపారులపై కిరాయి అద్దెల భారం మోపరాదని ఆయన స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో అద్దెలు లేకుండా మార్కెట్లు నడుస్తున్నట్లు ఉదాహరణ చూపుతూ, ఇక్కడ కూడా వ్యాపారులను కాపాడాలని కోరారు. గాంధీ పార్కులోని అంబేద్కర్ భవనాన్ని అభివృద్ధి చేయాలని కూడా ఆయన సూచించారు. డిమాండ్లను తక్షణమే నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, 18వ వార్డు కౌన్సిలర్ దేశపల్లి నవీన్, 25వ వార్డు కౌన్సిలర్ నల్రా సంధ్యా, శ్రావణ్ వెలుగు, అబోతు అశోక్, కేదాసు రమేష్, బానోతు లింగనాయక్, అజ్మీర వేణు, నక్క నాగార్జున, కూరాకుల పాల్, కవిత, సునీత, నీలం వెంకటేశ్వర్లు, బండి వెంకటరమణ, మేక వెంకటేష్, రమేష్, రవి, యూసుఫ్ గారు, రవిచంద్రబోస్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వర పరిష్కారం చేయాలి -- కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 200 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామసభల్లో అన్ని శాఖలకు సంబంధించిన పథకాల అమలు వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, సన్నబడి బోనస్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలతో పాటు, త్వరలో ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకం, దివ్యాంగ విద్యార్థులకు వాహనాల పంపిణీ వంటి కార్యక్రమాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా ఆరోగ్యం, రహదారి భద్రత, పిల్లల భద్రత, మాదకద్రవ్యాలకు నో వంటి అంశాలపై కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి



**మంచిర్యాల, మార్చి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావుతో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, దాసరి రమేష్ తమ తాతల నుండి వస్తున్న పట్టా భూమిని పొరపాటున నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, సవరించి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు. కిష్టంపేట గ్రామస్తులు జాతీయ రహదారి 63లో జోడు వాగులపై కొత్త వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి మండలానికి చెందిన శ్రీనివాస్ తనకు గిఫ్ట్ డీడ్, న్యాయస్థానం డిక్రీ ద్వారా సంక్రమించిన భూమి పట్టాను కొందరు అక్రమంగా రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. అశోక్ రోడ్డుకు చెందిన పాలకుర్తి రమాదేవి తన భర్త మరణించినందున భూమిని తన పేరిట విరాసత్ చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు. వేమనపల్లి మాజీ సర్పంచ్ తలండి స్వరూపారాణి తన పదవిలో చేసిన ఖర్చులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కన్నాల గ్రామానికి చెందిన భీమనపల్లి రామచంద్రం తన భూమి ఆన్‌లైన్ భూభారతిలో అసైన్డ్ భూమిగా చూపుతోందని, సవరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దాదాపు వెయ్యి మంది ప్రజలు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని, నూతన భవన నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలోనే ఆసుపత్రిని కొత్త భవనంలోకి తరలించనున్నట్లు వెల్లడించారు. అనంతరం నస్పూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాత మంచిర్యాలలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం, హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించి సర్వైకల్ క్యాన్సర్ నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. టి.బి. ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.

## బ్రాహ్మణ పరిషత్ నిధులు వెంటనే మంజూరు చేయాలి

-ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సుదర్శన్ ప్రసాద్ తివారి
-ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సుదర్శన్ ప్రసాద్ తివారి ని కలిసిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము



**వరంగల్, మార్చి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** బ్రాహ్మణ పరిషత్ నిధులు వెంటనే మంజూరు చేయాలని ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సుదర్శన్ ప్రసాద్ తివారి అన్నారు. సోమవారం వరంగల్ హరిత కాకతీయ హోటల్ నందు బ్రాహ్మణుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సుదర్శన్ ప్రసాద్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము హరిత కాకతీయ హోటల్ లో ఆల్ ఇండియా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సుదర్శన్ ప్రసాద్ తివారి ని మర్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ నిధులు వెంటనే మంజూరు చేసి పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# బిజినెస్

## కుప్పకూలిన మార్కెట్స్.. భారీ నష్టాలు!




**ఇంటర్నెట్ డెస్క్:**
పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత ముదరవచ్చన్న భయాల నడుమ సోమవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 1635.67 పాయింట్ల మేర పతనమై 71,947.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 488.20 పాయింట్ల మేర తగ్గి 22,331.40 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా 2.6 శాతం మేర పతనమయ్యాయి. ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ, టెలికం, రియల్టీ, ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు నేడు 2-4 శాతం మేర నష్టాలను మూటగట్టుకున్నాయి.నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒకానొక దశలో 95.12 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి తాకింది. చివర్లో కాస్త కోలుకుని 94.83 డాలర్ల వద్ద ముగిసింది. చమురు ధరలు మళ్లీ ఆకాశాన్నంటడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కొన్ని రోజుల క్రితం 100 డాలర్ మార్కు దిగువకు చేరిన బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర ప్రస్తుతం 115 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్లకు చేరవచ్చునే అంచనాలు కూడా మార్కెట్ వర్గాలను కలవరపెడుతున్నాయి.

# దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..

దేశంలో బంగారం, వెండి ధరలు అతి స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా భారీ స్థాయిలో దిగి వస్తున్న బంగారం, వెండి ధరలతో ఎంతో ఊరట కలిగిస్తోంది. అయితే రెండు రోజులుగా మాత్రం మళ్లీ పెరుగుతోంది. ఇక మార్చి 30వ తేదీన సోమవారం మాత్రం అతి స్వల్పంగా తగ్గింది. దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,080 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద ట్రేడవుతోంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో ధరల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే కిలో



వెండి ధర రూ.2,49,900 వద్ద ఉంది.

ఇక విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఒకే ధరలు ట్రేడవుతున్నాయి.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,010 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,590 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,740 వద్ద కొనసాగుతోంది.

ఇక ముంబై, ఢిల్లీ, బెంగళూరులలో కిలో వెండి ధర రూ.2.44.900 వద్ద ట్రేడవుతోంది.

# భెల్‌కు రూ.13,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

### ఎన్‌టిపిసి నుంచి మెగా ఆర్డర్




**హైదరాబాద్**
విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు తెలంగాణలో భారీ ప్రాజెక్టు దక్కింది. పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న 3ఇ800 మెగావాట్ల సామర్థ్యం గల స్టేజ్2 సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ఎన్‌టిపిసి లిమిటెడ్ నుండి సుమారు రూ.13,500 కోట్ల భారీ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నోటిఫికేషన్ ఆఫ్ అవార్డ్ (ఎఒఎ)ను మార్చి 29న అందుకుంది. ఈ వివరాలను సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించారు. ఈ కాంట్రాక్టులో భాగంగా బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బిటిజి)ల రూపకల్పన, తయారీ, సరఫరా, స్థాపనతో పాటు సివిల్, స్ట్రక్చరల్ పనులను కూడా భెల్ చేపట్టనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును అవార్డు అందిన తేదీ నుండి 62 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

# బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపాలి

### వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌పై శ్రీకాంత్ పెదవి విరుపు

**చెన్నై**
టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత కొంత కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 ఆదిలో అద్భుతంగా బౌలింగ్ వేసిన వరుణ్.. క్రమంగా గతి తప్పి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఐపీఎల్‌లోనూ అదే రీతి కొనసాగుతోంది. కేకేఆర్ తరపున ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడు.. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 48 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిపై టీమిండియా మాజీ క్రికెటర్




క్రిష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'బంతిని విభిన్నంగా వేయడం, లెగ్ స్పిన్ సంధించడాన్ని నేర్చుకోనంత వరకు వరుణ్ చక్రవర్తి ఇబ్బందిపడుతూనే ఉంటాడు. ఎప్పుడూ గూగ్లీలు వేయడం వర్కౌట్ అవ్వదు. బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించాలి. కొన్నిసార్లు లెగ్ స్పిన్ వేయాలి. ఇప్పుడైతే అతడి బౌలింగ్‌లో ఎలాంటి మిస్టరీ లేదు. అదంతా హిస్టరీగా మారిపోయింది. బ్యాటర్లకు కాస్త దూరంగా బంతిని విసరాలి. అప్పుడు షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు ఇస్తారు. దీంతో తర్వాత వచ్చే బ్యాటర్లు కాస్త జంకుతారు. ఇక్కడ ఆయా జట్ల సారథులకూ ఓ మాట చెబుతున్నా. ఇప్పుడు వరుణ్‌కు పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు. ముంబైతో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇలానే వరుణ్ వేసిన తొలి ఓవర్లో దూకుడుగా పరుగులు రాబట్టాడు. దాంతో వరుణ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది' అని క్రిష్ శ్రీకాంత్ వెల్లడించాడు.

# 31మందితో హాకీ శిక్షణా శిబిరం

### మహిళల ప్రపంచకప్, ఆసియాకప్‌లకు ఎంపిక

**భువనేశ్వర్:**
31మంది సీనియర్ మహిళా హాకీ క్రీడాకారిణులకు హాకీ ఇండియా(హెచ్ఐ) శిక్షణా శిబిరం నిర్వహించనుంది. ఏప్రిల్ 1 నుంచి 9వరకు జరిగే ఈ శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రదర్శించిన ప్లేయర్లను ఈ ఏడాది జరిగే మెగా ఈవెంట్‌లకు ఎంపిక చేయనుంది. హైదరాబాద్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో రజత పతకంతో మెరిసి హాకీ ప్రపంచకప్‌కు భారతజట్టు అర్హత సాధించింది. దీంతో ఈ శిక్షణా శిబిరం ద్వారా మహిళల హాకీ ప్రపంచకప్‌కు ఆడే తుది జట్టును ఎంపిక చేయనున్నారు. కొత్త కోచ్ స్జోర్డ్ మారిజ్నే నేతృత్వంలోనే మహిళల జట్టు ఈ శిక్షణా శిబిరం ద్వారా ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకునేందుకు కసరత్తు చేయనుంది. రాబోయే రోజుల్లో భారత మహిళల హాకీ జట్టు బిజీ షెడ్యూల్‌తో గడపనుంది. జూన్‌లో ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ నేషన్ కప్, ఆగస్టులో ప్రపంచకప్, ఆ తర్వాత సెప్టెంబర్ 19నుంచి అక్టోబర్ 4వరకు ఆసియా క్రీడల్లో భారత జట్టు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. గోల్‌కీపర్ల కోటాలో సవిత, మాధుర కిండో, బన్సరి సోలంకితోపాటు ఇటీవల గోల్‌కీపర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన బిచ్చు దేవి ఖరిబమ్ కూడా రేసులో ఉన్నారు. తీరిక లేని షెడ్యూల్‌తో గడపనున్న క్రమంలో ఈ శిక్షణా శిబిరం ప్లేయర్లను మానసికంగా సన్నద్ధం చేసేందుకు దోహదపడుతుందని కోచ్ మారిజ్నే తెలిపారు. శిక్షణా శిబిరానికి ఎంపికైన ప్లేయర్లు : గోల్‌కీపర్లు: సవిత, మాధురి కిండో, బిచ్చుదేవి ఖరిబన్, బన్సారి సోలంకి డిఫెండర్లు: నిక్కి ప్రదాన్, ఇషికా చౌదరి, జ్యోతి సింగ్, లాల్‌తుంగ్లింగి, జ్యోతి, ఉదిత, షిల్పి దబాస్ మిడ్‌ఫీల్డర్లు: సుశీలా ఛాను, మనీషా చౌహాన్, వైష్ణవి, సాక్షీ రాణా, సునెలిటా టొప్పో, నేహా, ఇషికా. ఫార్వర్డ్స్: దీపిక సోరెంగ్, రుతుజ దదాసో, బల్జీత్ కౌర్, నవ్‌నీత్ కౌర్, దీపిక, అన్ను, బ్యూటీ, హినా బానో, సోనమ్, లాల్‌రిమిసిమి, ముంతాజ్, సంగీత.

HOCKEY INDIA

# స్పోర్ట్స్

## మహికా శర్మకు 1.7 కోట్ల ఖరీదైన కారు గిఫ్ట్ ఇచ్చిన హార్దిక్ పాండ్యా




క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్‌కు ఓ ఖరీదైన లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇచ్చాడు. సుమారు 1.7 కోట్ల ఖరీదైన మెర్సిడీజ్ బెంజ్ వీ క్లాస్ కారును బహుమతిగా అందజేశాడు. స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. తన లగ్జరీ లైఫ్ స్టయిల్‌తో అందర్నీ అట్రాక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే 12 కోట్ల ఖరీదైన అల్ట్రా లగ్జరీ ఫెరారీ కారును పాండ్యా సొంతం చేసుకున్నాడు. అయితే స్వల్ప గ్యాప్‌లోనే మళ్లీ గర్ల్‌ఫ్రెండ్ మహికాను సర్‌ప్రైజ్ చేశాడు. గిఫ్ట్ ఇచ్చిన కారుతో పాండ్యా-మహికా దిగిన ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ పిక్స్‌కు అతని ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. ఆదివారం ఐపీఎల్‌లో భాగంగా వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ సారథ్యంలోని ముంబై జట్టు ఆరు వికెట్ల తేడాతో కోల్‌కతాపై విక్టరీ నమోదు చేసిన విషయం తెలిసిందే.